# దళితులను ఉద్ధరించడానికే అయ్య పుట్టిండు


ముంజంపల్లిలో బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో మంత్రి కొప్పుల ఈశ్వర్

- అన్ని వర్గాల సంక్షేమమే ఆయన ధ్యేయం
- సీఎం కేసీఆర్‌పై మంత్రి కొప్పుల ఆసక్తికర వాఖ్యలు
- బీఆర్‌ఎస్‌లో 300 మంది చేరిక

వెల్గటూర్, అక్టోబర్13 : 'దళితులను ఉద్ధరించడానికి అయ్య పుట్టిండు. తండ్రి పాత్ర పోషిస్తూ అభ్యున్నతికి పాటుపడుతున్నడు. దళితబంధు తెచ్చి వెలుగులు పంచుతున్నడు' అని సీఎం కేసీఆర్‌పై మంత్రి ఈశ్వర్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా ఎండపెల్లి మండలం ముంజపల్లి, మారేడుపల్లి, ఉండెడ గ్రామాల నుంచి వేల హరీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన 300 మంది బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి మంత్రి గులాబీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముంజంపల్లిలో మంత్రి మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. పేదింట్లో ఆడబిడ్డ పెళ్లిళ్లకు ₹లక్ష సాయం, ప్రభుత్వ దవాఖానలో ప్రసవిస్తే కేసీఆర్ కిట్‌తోపాటు ₹12 వేల సాయం అందిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి 24 గంటల ఉచిత విద్యుత్, సకాలంలో ఎరువులు, విత్తనాలు అందజేయడంతోపాటు రైతు బంధు, రైతుబీమా అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పల్లెలన్నీ పచ్చదనం, పరిశుభ్రతతో వెల్లివిరుస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని 12,769 గ్రామాల్లో ఏ గ్రామానికి వెళ్లినా అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా మన మాదిరి పథకాలు అమలులో లేవన్నారు. మిగతా రాష్ట్రాల్లో దళితుల పరిస్థితి దారుణంగా ఉందని తెలిపారు. దళితబంధు ద్వారా రాష్ట్రంలో మొదటి విడుతలో 40 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, రెండో విడుతలో 2 లక్షల 70 వేల కుటుంబాలకు లబ్ధి జరుగుతుందని చెప్పారు. ఇంత మంచి పథకం అమలు చేస్తుంటే కాంగ్రెస్ వాళ్లు ఇందులో దూరి కొందరిని అనవసరంగా రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. మరో నాలుగు నెలల్లోనే మూడో విడుత కింద మిగిలిన వారికి వస్తాయన్నారు. బీసీ కులవృత్తుల వందశాతం సబ్సిడీపై లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాయ మాటలు నమ్మవద్దని సూచించారు. మోసగాళ్లను గుర్తుపట్టి అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య, వెల్గటూర్ ఎంపీపీ లక్ష్మి, మాజీ జడ్పీటీసీ అనిత, పార్టీ మండలాధ్యక్షుడు జగన్ తదితరులున్నారు.

# నేను మీ బిడ్డను.. ఏ కష్టమొచ్చినా ఆదుకుంటా

- మరోసారి ఆశీర్వదించండి
- చొప్పదండి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- మల్యాల మండలంలో ప్రచారం


మానాలలో సుంకె రవిశంకర్‌కు తిలకం దిద్దుతున్న మహిళలు

మల్యాల, అక్టోబర్ 13 : 'నేను స్థానికుడిని. మీ బిడ్డను. మీకు ఏ కష్టమొచ్చినా అందుబాటులో ఉంటా. మీ సమస్యను పరిష్కరిస్తా. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే చొప్పదండి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని' చొప్పదండి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన మల్యాల మండలంలోని మ్యాడంపల్లి, మానాల, తక్కళ్లపల్లి, తాటిపల్లి, లంబాడిపల్లి, సర్వాపూర్, గుడిపేట గ్రామాల్లో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, ఒగ్గు కళాకారుల నృత్యాల మధ్య ప్రజలు స్వాగతం పలుకగా, ఎమ్మెల్యే రవిశంకర్ ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి తనని గెలిపించాలని అభ్యర్థించారు. ఆయాచోట్ల ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేసే చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థులెవరూ ఈ ప్రాంతం వాళ్లు కాదని, వాళ్లకు ప్రజా సమస్యలపై అవగాహనే లేదని విమర్శించారు. ఇప్పుడు కల్లబొల్లి కబుర్లు చెప్పేందుకు గ్రామాలకు వస్తున్నారని, వారి మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. 3 గంటలు కరెంటిచ్చే కాంగ్రెసోళ్లు కావాలో..? లేదా 24 గంటలు కరెంటిచ్చే బీఆర్‌ఎస్ వాళ్లు కావాలో..? ప్రజలే ఆలోచించుకోవాలని సూచించారు. తనది ఇదే నియోజకవర్గమని, స్థానికుడిగా తనకు ఈ ప్రాంత సమస్యలపై పూర్తి అవగాహన ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఒక్కో పంచాయతీకి ₹50 లక్షలకు తగ్గకుండా ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరించామని చెప్పారు. ఇంకా ఏమైనా సమస్యలున్నా పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని, తర్వాత పూర్తి చేస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని, తొమ్మిదేళ్ల క్రితం ఎలా ఉన్నది? ఇప్పుడెలా ఉన్నది? ఓ సారి ఆలోచించాలని సూచించారు. నాడు కరువునేలగా ఉన్న చొప్పదండి నియోజకవర్గం ఇప్పుడు ప్రాజెక్టులు, 24గంటల కరెంట్‌తో సస్యశ్యామలంగా మారి, పంటలు సమృద్ధిగా పండుతున్నాయన్నారు. అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే కొండగట్టు క్షేత్రాన్ని యాదాద్రి, తిరుమల తరహాలో మరింత అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఆయన వెంట మల్యాల జడ్పీటీసీ కొండపలుకుల రామ్మోహన్‌రావు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, జిల్లా కోఆప్షన్ మెంబర్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

# 'పొనుగోటి'కి వినూత్నంగా బర్త్‌డే విషెస్


కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్‌రావు



బిల్ బోర్డుపై శ్రీనివాస్‌రావు జన్మదిన వేడుకల్లో కేసీఆర్‌తో కలిసి ఉన్న ఫొటో

ధర్మపురి, అక్టోబర్ 13 : తెలంగాణ రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు పొనుగోటి శ్రీనివాస్‌రావు బర్త్‌డే సందర్భంగా అభిమానులు వినూత్నంగా విషెస్ తెలిపారు. అమెరికాలో ఉంటున్న ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండల వాసులు సరికొత్తగా వేడుకలు జరిపారు. ఎన్‌ఆర్‌ఐ లక్కాకుల సాయికుమార్ ఆధ్వర్యంలో న్యూయార్క్ నగరంలోని వాల్‌స్ట్రీట్ టైమ్‌స్క్వేర్ ఐకానిక్ బిల్ బోర్డుపై బర్త్‌డే వీడియోను ప్రదర్శించారు. అలాగే హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోని పొనుగోటి శ్రీనివాస్‌రావు నివాసంలో సుమారు వెయ్యి మంది ముఖ్య నాయకులు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంతోపాటు కరీంనగర్, హైదరాబాద్‌లోని పలుచోట్ల శ్రీనివాస్‌రావు యువసేన ఆధ్వర్యంలో పేదలకు వివిధ రకాల ఆహార పదార్థాలు అందజేశారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

# అవకాశమివ్వండి.. మరింత అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను నమ్మి మోసపోవద్దు
- పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పిలుపు
- 200 మంది బీఆర్‌ఎస్‌లో చేరిక

జగిత్యాల, అక్టోబర్ 13 : జగిత్యాల ఎమ్మెల్యేగా మరోసారి అవకాశమివ్వాలని, మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నమ్మి మోసపోవద్దని, పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. అన్ని వర్గాలకు భరోసానిస్తున్న కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేయాలని పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని 19వ వార్డు జంబిగద్దెకి చెందిన 200 మంది గౌడ సంఘం, మైనార్టీ, ఇతర వర్గాల యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ రాక ముందు, వచ్చిన తర్వాత జగిత్యాల అభివృద్ధిపై చర్చ చేయాలని సూచించారు. జగిత్యాలలో ఉపాధి అవకాశాలు మెరుగు పడ్డాయని, జిల్లా కేంద్రం, మెడికల్ కాలేజీ ఏర్పాటుతో సామాన్యులకు ఎంతో ఉపయోగం కలిగిందన్నారు. జిల్లా ఏర్పాటు తర్వాత 56 ప్రభుత్వ విభాగాలు జిల్లా కేంద్రంలో అందుబాటులోకి వచ్చాయని, పాలన చేరువైందని చెప్పారు. ₹500 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగంగా నడుస్తున్నాయని చెప్పారు. 600 పడకల దవాఖానగా మారనుందని, 134 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయడం గొప్ప విషయమన్నారు. రోడ్లు, వైకుంఠ ధామాలు, పార్కులు, మార్కెట్లు, ఓపెన్ జిమ్‌లు తదితర అభివృద్ధి పనులు కండ్లకు కట్టినట్లు కనిపిస్తున్నదన్నారు. కల్యాణ లక్ష్మి,ఆసరా పెన్షన్, కేసీఆర్ కిట్, రైతు బంధు, బీమా తదితర పథకాలతో ఎందరికో లబ్ధి చేకూరిందని చెప్పారు. జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డును వంద మీటర్ల వెడల్పు చేశామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించామని చెప్పారు. తొమ్మిది జూనియర్ గురుకుల కళాశాలలు, మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు. నూకపల్లిలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చరిత్రలో నిలిచి పోతుందని చెప్పారు. హైదరాబాద్ తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లా జగిత్యాల అని మంత్రి కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రశంసించారని గుర్తు చేశారు. మరోసారి అవకాశం ఇస్తే, మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ చంద్ర శేఖర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, గట్టు సతీశ్, కౌన్సిలర్లు ముస్కు నారాయణరెడ్డి, క్యాదాసు నవీన్, పంబాల రామ్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు వొల్లెం మల్లేశం, సోషల్ మీడియా పట్టణ కన్వీనర్ అలిశెట్టి వేణు, నాయకులు రంగు మహేశ్, రామకృష్ణ, రాగుల రాజు, రాజ్ కుమార్, మతీన్, గాజుల ప్రతాప్ గౌడ్, క్యాదాసు నాగయ్య, అనిల్, కార్మిక విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ ఉపాధ్యక్షుడు పవన్ నూకపల్లి రాజన్న, ప్రసాద్‌గౌడ్, అమీన్, మోసిన్, అతెమ్మద్ ఉల్ హక్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# సంజయ్ కుమార్‌ను గెలిపిద్దాం

- కలిసికట్టుగా పనిచేద్దాం.. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేద్దాం
- కార్యకర్తల సమావేశంలో జగిత్యాల ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్ రమణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎల్ రమణ పక్కన ఎమ్మెల్యే సంజయ్, దావ వసంత

జగిత్యాల, అక్టోబర్ 13 : అందరం కలిసికట్టుగా పనిచేసి డాక్టర్ సంజయ్ కుమార్‌ను జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఎమ్మెల్సీ ఎల్ రమణ పిలుపునిచ్చారు. కేసీఆర్‌ను మరోసారి సీఎంగా చేద్దామని విజ్ఞప్తి చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం జగిత్యాల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, . దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ ఫలాలను గడపగడపకూ వివరించాలని, ప్రతి కార్యకర్త వంద మంది ఓటర్లతో మాట్లాడాలని సూచించారు. బీఆర్‌ఎస్ జెండాను మరోసారి ఎగురవేద్దామని, అందుకోసం ప్రతి ఒక్కరం కష్టపడుదామని కోరారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ఎమ్మెల్యే సంజయ్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో జగిత్యాల, రాయికల్ మున్సిపల్ చైర్లన్లు గోలి శ్రీనివాస్, మోర హన్మాండ్లు, పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, రూరల్ ఎంపీపీ పాలెపు రాజు, జడ్పీటీసీలు, ప్యాక్స్ చైర్మన్లు పాల్గొన్నారు.